జిల్లాలో ఇప్పటి వరకు మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా.. (మి.మీ.లలో)

భీంపూర్	448.6	మావల	453.3
జైనథ్	530.0	తాంసి	568.2
బేల	543.7	తలమడుగు	464.5
గాదిగూడ	481.3	బజార్‌హత్నూర్	550.9
నార్నూర్	431.2	బోథ్	484.4
ఇంద్రవెల్లి	599.1	నేరడిగొండ	409.2
గుడిహత్నూర్	523.3	ఇచ్చోడ	499.2
ఆదిలాబాద్ రూరల్	714.6	సిరికొండ	514.2
ఆదిలాబాద్ అర్బన్	734.8	ఉట్నూర్	679.7

● జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న ముసురు వర్షం



● జిల్లాకేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కు రోడ్డుపై భారీ గుంతలు ఇలా..



అంతటా.. ముసురేసింది!

- జిల్లాలో గత నాలుగైదు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఈ యేడు ఇప్పటివరకు 535.0 మి.మీ. అధిక వర్షాపాతం నమోదు
- ఏకధాటి వర్షాలతో నిండుతున్న కుంటలు, చెరువులు, ప్రాజెక్టులు
- ముసురు వర్షాలతో ముందుకు సాగని వ్యవసాయ పనులు
- అధ్వానంగా మారిన పట్టణ, గ్రామీణ ప్రాంతాల రోడ్లు
- జిల్లావ్యాప్తంగా అధిక వర్షాలతో ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు

ఆదిలాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి జనజీవనం పూర్తిగా స్థంభించి పోయింది. జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే కుంటాల, పొచ్చెర జలపాతాలు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. భారీ వర్షాల కారణంగా అధికారులు జలపాతాల వద్దకు పర్యటకుల సందర్శనను నిలిపి వేశారు. జూన్ 1నుంచి జూలై 24 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 447.2 మి.మీ.లు కాగా.. అధికంగా 535.0 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. కాగా, జిల్లాలో అత్యధికంగా ఆదిలాబాద్ అర్బన్‌లో 734.8 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా.. ఉట్నూర్‌లో 679, బేల మండలంలో 543.7, తాంసిలో 568.2, ఇంద్రవెల్లిలో 599.1, గుడిహత్నూర్‌లో 523.3, ఆదిలాబాద్ రూరల్‌లో 714.6 మి.మీ.ల అధిక వర్షపాతం నమోదైంది. మిగితా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. అత్యల్పంగా నార్నూర్ మండలంలో 431.2, నేరడిగొండలో 409.2 మి.మీ.ల వర్షపాతం కురిసింది. కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు, ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోతున్న సాగు పనులు

గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలనే సాగు చేస్తారు. పత్తి, సోయా, కంది పంటలు ఏపుగా పెరిగి ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. కానీ, అధిక వర్షాలతో పంటల ఎదుగుదల నిలిచిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సారవంతమైన నల్లరేగడి నేలలే ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటలు అధిక తేమతో ఎరుపుబారి ఎదుగుదల లేకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. ఎర్ర నేలలు, ఎత్తు ప్రాంతాల్లో పంటలు ఏపుగా పెరిగి కనిపిస్తున్న నల్లరేగడి నేలలు అధిక తేమతో జౌకు పట్టి పోయే అవకాశం ఉంటుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే పంటల సాగును పూర్తి చేసిన రైతులు కలుపు నివారణ, మందులు పిచికారి, ఎరువులు వేయడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. కురుస్తున్న వర్షాలు ఆటంకంగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలో కనిష్ఠ స్థాయిలోనే వరి పంట సాగు కనిపిస్తుంది. ఎక్కువగా ఆరుతడి పంటలే సాగవుతున్నాయి. ముసురు వర్షాలతో పంటలను చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందంటున్నారు. దీంతో దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత నాలుగైదు రోజులుగా సాగు పనులు నిలిచి పోవడంతో రైతులు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్లు

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణ, గ్రామీణ రోడ్లు ధ్వంసమై పోతున్నాయి. వరద ఉధృతికి రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారుతున్నా యి. అలాగే వర్షపునీరు రోడ్లపై చేరి భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయం భయంగానే రోడ్లపై ప్రయాణం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా మారుమూల గ్రామాల రోడ్లు బురదమయంగా మారడంతో అడుగు తీసి అడుగువేసే పరిస్థితి లేదంటున్నారు. రోడ్లపై భారీ గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని ఇండస్ట్రియల్ పార్కు, దోబీఘాట్, తాటిగూడ, కేఆర్‌కే, న్యూహౌజింగ్ బోర్డు, పట్టణ శివారు ప్రాంతాల కాలనీల రోడ్లు అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. సంబంధిత శాఖల అధికారులు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలుస్తున్న తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ రోడ్లకు ఇరువైపుల ముళ్ల పొదలు, పెరిగిపోయి మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డు నిబంధనలను పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు.

పెరుగుతున్న నీటిమట్టం

జిల్లావ్యాప్తంగా ముసురు వర్షాలతో చెరువులు, కుంటలు ప్రాజెక్టుల నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. అయినా ఆశించినస్థాయిలో వరదనీరు రావడం లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు. గత నాలుగైదు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరదనీరు వచ్చి చేరుతోంది. సాత్నాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 284.15 మీటర్లకు చేరుకుంది. అలాగే మత్తడివాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 276.00 మీటర్లకు చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం ఎగువ ప్రాంతం నుంచి వందల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ముసురు వర్షాలతో భూగర్భ జలాలు ఆశించినస్థాయిలోనే కనిపిస్తున్నాయి. జలాశయాలు నిండుకోవడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఇక వర్షాకాల పంటల సాగుకు ఢోకా లేదని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.



● వరదనీటితో పరవళ్లు పెడుతున్న చాందావాగు



● జిల్లాకేంద్రంలోని జ్యోతిబా పూలే గురుకులంలో గొడుగుల సహాయంతో వెళ్తున్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం



నితిన్‌గడ్కారికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నితిన్‌గడ్కారిని ఎంపీ గోడం నగేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి 44 నుంచి మహారాష్ట్రలోని రాజురా వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని అదేవిధంగా బోరజ్ నుంచి మహారాష్ట్రలోని ఉపాసనాల గ్రామం వరకు 33కి.మీ.ల రోడ్డును నాలుగు వరుసల రహదారిగా మార్చాలని కోరారు. దీంతో స్పందించిన కేంద్రమంత్రి పనులకు సంబంధించిన డీపీఆర్‌ను అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. అలాగే మాహోర్ నుంచి చంద్రాపూర్ వయా సర్కాని, మాండ్వి, ఉన్కేశ్వర్, నాగపూర్, కరంజి, అర్లి, ధనోరా, భీంపూర్, జందాపూర్ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని కోరారు.

బీఎడ్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, జూలై 24: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొమురంభీం ప్రాంగణంలో ఉన్న బీఎడ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండేళ్ల బీఈడీ కోర్సు కోసం ప్రవేశం కోసం అర్హులైన తెలంగాణ రాష్ట్రంలోని జరిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 35, భౌతికశాస్త్రంలో 10, ఆంగ్లంలో పది సీట్ల వంతున మొత్తం 100 సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించి కళాశాల పరిధిలో ఈనెల 24 నుంచి ఆగస్టు 23వరకు ఐదు గంటలలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం అడ్మిషన్ ఇన్‌చార్జీ సెల్ నెం.9440848073, 8500995561, 8500726046 ద్వారా సంప్రదించవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్పులు చేర్పులు చేసే అధికారం యాజమాన్యానికి లేదని గమనించగలరని అన్నారు.

28న మెగా రక్తదాన శిబిరం

గూడిహత్నూర్, జూలై 24: ఈనెల 28న మండలంలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మల్కాపూర్, చిన్న మల్కాపూర్, గర్కంపేట్, సోమార్ పెట్, సితాగొంది, మాన్కుగూడ, మచ్చపూర్, కోలంగూడ, తదితర గ్రామాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావ్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కురం చత్రుఘన్ , మండల ప్రధాన కార్యదర్శి ఉయిక శ్యాంరావు, ఆదివాసి రైతు సేన మండల ప్రచార కార్యదర్శి పేందోర్ రాందాస్, మడవి రాము, తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్లపై నడక నరకమే!

● బురదమయంగా మారిన గ్రామీణ రోడ్లు ● వాహనదారులు, పాదచారులకు తప్పని తిప్పలు ● ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు



గుట్టపక్క తండా రోడ్డు బురదమయంగా మారడంతో రోడ్డు పక్కన నుంచి నడిచి వెళుతున్న పాదాచారుడు



సోనాలలో ప్రధానరోడ్డుపై ఇబ్బందుల మధ్య వెళుతున్న వాహనదారులు



అడేగామ(కె) గ్రామంలో నీటిమడుగులో నుంచి అవస్థలు పడుతూ.. ప్రయాణిస్తున్న వాహనదారులు



అంతర్‌రాష్ట్ర రహదారిపై ఏర్పడ్డ భారీ గుంతలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు, వాహనదారులు

బోథ్, జూలై 24: మండలంలోని ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాలలో రోడ్లు బురదమయం కావడంతో పాదాచారులతో పాటు వాహన చోదకులు ఇబ్బందుల పాలవుతున్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న సోనాల మండలకేంద్రంలో ప్రధాన రహదారి బురదమయం కావడంతో కాలినడకన నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రతి బుధవారం ఇదే రోడ్డుపై సంత కొనసాగుతూ ప్రతీ బుధవారం ఇదే రోడ్డుపైన సంత కొనసాగుతూ ఉండటంతో సంత నిర్వహణకు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు సంతలోకి వచ్చే వారు సైతం సతమతమవుతున్నారు. మరో వైపు అంత రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న గుట్ట పక్క తండా గ్రామంలోకి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో పాదాచారులు నడవడం కష్టంగా మారింది. అధికారులు ఆయా గ్రామాలలో రోడ్డు వసతి కల్పించాల్సిన అవసరం ఉంది.

● అధ్వానంగా అంతర్‌రాష్ట్ర రహదారి

ఇచ్చోడ: మండలంలో కురుస్తున్న ముసురు వర్షంతో పలుచోట్ల రోడ్లపై నీరునిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మండలంలోని అడేగామ(కె) గ్రామంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై నీరెళ్లే దారి లేక రోడ్లపై మడుగులుగా మారాయి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈదారి గుండా పయనిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే చాలు నీటి మడుగులు, బురదమయమైన రోడ్లతో కాలం వెళ్లదీయాల్సి వస్తుందే తప్ప సంబంధిత శాఖల అధికారులు పట్టించకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

● పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటిన మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 24: బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలను జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలలో ఆడంబరాలు వద్దు, పర్యావరణ కార్యక్రమాలే ముద్దు అన్న కేటీఆర్ ఆలోచన యావత్ సమాజానికి స్ఫూర్తివంతం అన్నారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇందులో రౌత్ మనోహర్, అలాల్ అజయ్, సేవ్వ జగదీప్, సాజిదొద్దిన్, విజ్జగిరి నారాయణ, మార్శెట్టి గోవర్ధన్, వేణు గోపాల్ యాదవ్, ఇజ్జగిరి నారాయణ, కస్తాల ప్రేమల, స్వరూప, మమత తదితరులున్నారు.



మాజీ మంత్రి జోగు రామన్నకు కేక్ తినిపిస్తున్న నాయకులు

● 'కేటీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం'

రాబోయే రోజుల్లో రాష్ట్రానికి కేటీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేని మనిషా అన్నారు. బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేని పవన్‌రావు ఆధ్వర్యంలో రిమ్స్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు రోగులకు అన్నదానం నిర్వహించారు. కేటీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.



కుంటాల జలపాతం వద్ద ట్రైనీ ఎఫ్‌బీవోలు

కుంటాల జలపాతానికి ట్రైనీ ఎఫ్‌బీవోలు

నేరడిగొండ, జూలై 24: దూలపల్లి అకాడమి నుంచి 35వబ్యాచ్‌కు చెందిన ట్రైనీ (శిక్షణ) ఎఫ్‌బీఓలు కుంటాల జలపాతాన్ని బుధవారం సందర్శించారు. ఏసీడీ రాంమోహన్ ఆధ్వర్యంలో 33మంది ఎఫ్‌బీవోలకు జలపాతం ప్రాముఖ్యతను వివరించారు. అటవి రక్షణ సిరిచెల్మరేంజ్ గురించి ఎఫ్ఆర్ఓ గణేష్ వివరించారు. అటవి సంపదను కాపాడాల్సిన ఆవశ్యకతను అటవి సంపదను స్మగ్లర్ల భారీ నుంచి ఎలా కాపాడాలో వివరించారు.ఇందులో ఎఫ్ఎస్ఓ వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్, తదితరులున్నారు.

ముంపు ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండండి : తహసీల్దార్

తలమడుగు, జూలై 24 : కురుస్తున్న భారీ వర్షాలతో ముంపు ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుస్తున్న భారీవర్షాలతో చెరువులు, వాగులు, వంకల వద్ద మండల వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చెరువుల్లో వర్షపు నీరు చేరి పోర్లి మత్తడి వద్ద నీరు బయటకు వెళ్లే అవకాశం ఉందని ఆ చుట్టూ ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా లో లెవెల్ వంతెనల వద్ద వాహనదారులు, ప్రయాణికులు పలు జాగ్రతలు పాటించాలన్నారు. ముఖ్యంగా అతి పురాతనమైన ఇండ్లలో నివసించేవారు జాగ్రతగా ఉండాలన్నారు. భారీ వర్షాలతో ఇలాంటి ప్రమాద సంభవించిన వెంటనే అధికారులకు సమాచారం అందిచాలన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇందులో డిటి ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ అజీమ్, రేవన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాలింపునకు అడ్డంకిగా మారిన వర్షం

● పెరుగుతున్న గంగాపూర్ వాగు ఉధృతి

ఉట్నూర్, జూలై 24: మండలంలోని గంగాపూర్ వాగులో ఐదు రోజుల కింద గల్లంతు అయిన యువకుని కోసం ఉట్నూర్ పోలీసులు చేపట్టిన గాలింపునకు వర్షం అడ్డంకిగా మారింది. ఐదు రోజులుగా పోలీసులు గజ ఈతగాళ్ల ద్వారా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గత శనివారం రాత్రి గంగాపూర్ వాగు దాటుతుండగా బొప్పరికుంటకు చెందిన టేకం లక్ష్మణ్ అనే గిరిజన యువకుడు వాగు వరద నీటిలో పడి కొట్టుక పోవడంతో ఆదివారం నుంచి పోలీసులు లక్ష్మణ్ ఆచూకి కోసం గాలింపు నిర్వహిస్తున్నారు. ఐదు రోజులుగా వర్షం ఏకధాటిగా కురుస్తునే ఉండడంతో గాలింపుకు అడ్డంకిగా మారినప్పటికి బుధవారం వాగు ఉధృతి మరింత పెరిగింది. ఏఎస్సై నందన్ వారే దిలీప్ ఆధ్వర్యంలో గాలింపు నిర్వహిస్తున్నారు. బుధవారం కూడా ఫలితం లేకుండా పోయిందని వాగునీటి ఉధృతి పెరగడంతో ఇబ్బందిగా ఉందని గజ ఈతగాళ్లు తెలిపారు. డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలిలు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



గంగాపూర్ వాగులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో మొక్కలు నాటిన సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, జూలై 24: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) కిరణ్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈచ్ వన్ ప్లాంట్ వన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్క నాటాలని సూచించారు. ఇందులో సిబ్బంది అంజనేయులు, రాజబాబు, సత్యనారాయణ, సయ్యద్ అహ్మద్‌హుస్సేన్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

బోథ్, జూలై 24: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కరిపి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బోథ్ మండల కేంద్రంలో కార్మిక అడ్డా వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చూస్తూ ఈ నెల 26న ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను మండలంలోని అన్ని గ్రామాల భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి వారిపెళ్లి రాజేశ్వర్, ఇప్ప శ్రీనివాస్, శంకర్, రమేష్, మల్లేష్, శ్యామకార చందు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

రామ మందిరంలో షెడ్ నిర్మాణం కోసం భూమిపూజ

తాంసి, జూలై 24 : మండల కేంద్రంలోని రామేశ్వర అలయంలో నూతనంగా నిర్మించే షెడ్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం భూమి పూజ చేశారు. రూ.ఐదు లక్షల వ్యయంతో నిర్మించే ఈ షెడ్‌కు స్థానిక నాయకులతో పాటు, గ్రామస్థులు హాజరై పనులను ప్రారంభించారు. రూ.కోటితో నిర్మించిన ఆలయం ప్రాంగణంలో షెడ్డు లేకపోవడంతో శుభ కార్యాలకు ఇబ్బంది కలిగేది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ రూ.ఐదు లక్షల వ్యయంతో షెడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారు. దీంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఎలాంటి నాణ్యత లోపం ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంత్రి గంగారెడ్డి, మహేందర్ రెడ్డి, చిన్న రాములు, వన్నెల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన అటవీ సిబ్బంది

బోథ్, జూలై 24: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం పొచ్చెర జలపాతం వద్ద ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. జలపాతాన్ని తిలకించేందుకు వచ్చినట్టుగా నటించి ఆత్మహత్య చేసుకునేందుకు బట్టలు తీస్తుండగా అక్కడే ఉన్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ అనిల్ సెక్యూరిటీ గార్డు బండారి అశోక్ గమనించారు. వెంటనే ఆయనను సహ ఉద్యోగి అనిల్‌ను వెంట తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని పట్టుకున్నారు. విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం జరిగింది.

విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ

భీంపూర్, జూలై 24: భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన విద్యావంతుడు యువజన సంఘాల నాయకుడు మల్లెల స్వామి తన జన్మదినం సందర్భంగా బుధవారం నిపాని పాఠశాలలో 150మంది విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం పుట్టిన రోజు సందర్భంగా బడి పిల్లలకు చేయూతనందిస్తానని ఈ సందర్భంగా మల్లెల స్వామి అన్నారు.

నేరడిగొండ తహసీల్దార్ బదిలీ

నేరడిగొండ, జూలై 24: తహసీల్దార్ సంతోష్‌రెడ్డి బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ బూష మహేశ్ ఇన్‌చార్జీ తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. నేరడిగొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహించినందుకు ఆనందంగా ఉందని మండలంలో నెలకొన్న భూ సమస్యలను సిబ్బందితో కలిసి పరిష్కరించాలన్నారు. కార్యాలయ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతోనే సాధ్యమైందని గుర్తు చేశారు. కాగా తహసీల్దార్ సంతోష్ రెడ్డిని కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఇందులో ఎంఆర్ఐ నాగోరావ్, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, జూనియర్ అసిస్టెంట్ రవి, ఎంసీ శంకర్, కార్యాలయ ఉద్యోగులు పెద్దులు, రాజారాం, శకీల్, ప్రభాకర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శకుంతల

డ్రైవర్లు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి

● సూపరింటెండెంట్ శకుంతల

ఉట్నూర్, జూలై 24: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు క్షేమంగా ఇంటికి చేరుకునేలా డ్రైవర్లు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని ఉట్నూర్ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ శకుంతల అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రతినిత్యం లక్షలాది కిలో మీటర్లు ప్రయాణిస్తూ ఆర్టీసీ ప్రజల కోసం పని చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడం సురక్షితంగా భావిస్తున్న ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రయాణికులను గమ్యంకు చేరుకోవాలన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ప్రమాదరహిత డిపోగా ఉట్నూర్ డిపోకు పేరు తెచ్చుకో వాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టీఐత్రీ పోశెట్టి, కంట్రోలర్లు ఆజం, కె.పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల రికార్డులు తనిఖీ

భోథ్, జూలై 24: మండలకేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఏపీడీ కృష్ణారావు రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈ ఏడాది ఇంత వరకు పూర్తి అయిన పనుల వివరాలతో పాటు ఎంబీ రికార్డులు పరిశీలించారు. అంతేగాక సామాజిక తనిఖీ బృందాల వారు రానున్నందున అవసరమైన రికార్డులన్నీ అందుబాటులో ఉంచాలని ఏపీవో జగదేవరావుకు సూచించారు. కాగా, మండలంలోని ఆయా గ్రామాల సీసీల వారీగా రికార్డులు పరిశీలించడం జరిగింది.

లంబాడాలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వరా? : లంబాడా జేఏసీ

ఉట్నూర్, జూలై 24: రాష్ట్రంలో 40 లక్షల జనాభా కలిగి ఉన్న లంబాడాలకు రాష్ట్ర మంత్రివర్గంలో ఒకరికి కూడా చోటు ఇవ్వక పోవడం లంబాడాలను అవమాన పరిచినట్టేనని లంబాడా జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బానోతు జగన్ ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యధిక జనాభా కలిగిన లంబాడాలకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు ఇవ్వకపోవడం సరైంది కాదని, వెంటనే మంత్రి వర్గాన్ని విస్తరించి లంబాడా ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో జేఏసీ ఉపాధ్యక్షుడు రాథోడ్‌శేషరావు, నేతావత్ రాందాస్ నాయక్, బానోత్ రామారావు, ఆడే ఉపేందర్, ప్రేమ్‌సింగ్ నాయక్, తదితరులున్నారు.

బీజేపీ ఎంపీలు దద్దమ్మలు : సుగుణ

ఉట్నూర్, జూలై 24: తెలంగాణ రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు దద్దమ్మలు కావడం వల్లనే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చేయి చూపిందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ విమర్శించారు. బుధవారం మండలకేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు పెద్దపీట వేసిందని, తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు నామమాత్రంగా ఉండిపోతున్నారని అన్నారు. కేంద్రంతో పోరాడి నిధులు తెస్తామని గత ఎన్నికల్లో హామీలు ఇచ్చిన ఎంపీలు.. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆమె వెంట రాజమ్మ, జాదవ్ సునీల్ నాయక్, రామారావ్, శ్రీకాంత్, అడెల్లు, నరసయ్య, పంద్రం రాజు, సకరాంలు పాల్గొన్నారు.

చదువులు ఎలా సాగుతున్నాయి?

● ఆదిలాబాద్ జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్‌కుమార్ ● బోథ్‌లో ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థుల విషయం పరిజ్ఞానాన్ని తెలుసుకుంటున్న అధికారి



పాఠశాలలోని రికార్డులను పరిశీలిస్తూ..

భోథ్, జూలై 24: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న చదువులతో పాటు పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను ప్రత్యేక అధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. దీనిలో భాగంగా సోమవారం పాఠశాలలోని తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు ఉన్న విషయ పరిజ్ఞానాన్ని అధికారి పరిశీలించారు. అంతేకాకుండా అధికారి అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చెప్పిన జవాబులతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులను పిలిచి భోజన మెనూ విషయమై అడిగి తెలుసుకున్నారు. అంతేగాక వంట విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఇక పాఠశాలలోని రికార్డులను పరిశీలించి ప్రభుత్వపరంగా అందుతున్న బియ్యం స్టాక్ నిల్వలను ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. పాఠశాల నిర్మాణం పట్ల ప్రధానోపాధ్యాయులు కుమ్మరి పోశెట్టిని ఉపాధ్యాయులను అభినందించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ ఈవో అంజయ్య ఉన్నారు.

మేకల మందపై చిరుత దాడి

● ఒక మేక మృతి మరో మేకకు తీవ్ర గాయాలు
● భయం గుప్పట్లో పశువులకాపరులు, రైతులు

తలమడుగు, జూలై 24: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కొత్తూరు శివారు ప్రాంతంలో ఒక వారం రోజులుగా చిరుతపులి సంచరించడంతో రైతులు, మేకల కాపరులు, పశువుల కాపరిదారులు ఆందోళన గురవుతున్నారు. చిరుతపులి దాడి మేకల మందలపై రెండు, మూడు రోజులకు ఒకసారి కొనసాగుతూనే ఉంది. దానికి నిదర్శనమే బుధవారం గోనే భూమన్న కొత్తూరు గ్రామం గ్రామ శివారులోని చెరువు ప్రాంతంలోకి మేకలను మేతకు తీసుకువెళ్లగా.. చిరుతపులి ఒక్కసారిగా దాడి చేసి ఒక మేకను పూర్తిగా ప్రాణాలు తీసింది. మరొక మేకపై దాడి చేయగా మేకల కాపరి అరుపులతో పారిపోయిందని గోనే భూమన్న తెలిపారు. కొత్తూరు శివారు ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నాయని, సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అటుగా రైతులు పశువుల కాపర్లు వెళ్లాలంటేనే జంకుతున్నారు. కాగా కొత్తూరు, కుచలాపూర్ గ్రామ శివారు ప్రాంతాలలో గతంలో కూడా పశువుపై చిరుతపులి దాడి చేయడంతో ఎన్నో మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.



మృతి చెందిన మేకను తీసుకెళుతున్న భూమన్న

పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



భీంపూర్, జూలై 24 : భీంపూర్ మండలం ఆర్లీ(టి) గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. కరంజీ (టి) నుంచి బుధవారం ఉదయం ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సు ఆర్లీ(టి) గ్రామంలోకి ప్రవేశించగానే బస్సు రోడ్డు పక్కనే ఉన్న బక్కి ఆనిల్ అనే రైతు కొట్టం లోకి దూసుకెళ్లింది. కట్టేసి ఉన్న ఎద్దును ఢీ కొట్టింది. దీంతో ఎద్దు తీవ్ర గాయాలపాలై చావుబతుకుల మధ్య ఉంది. ఎద్దు విలువ లక్ష రూపాలు ఉంటుందని రైతు చెప్పారు. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే భీంపూర్ ఎస్సై మహమ్మద్ కలిమ్, ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లారు. కాగా బస్సు అదుపు తప్పడానికి గల కారణాలను ఆర్టీసీ అధికారులు విచారణ చేపట్టారు.

ఆర్లి (టి)కొట్టం లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

బాధితులకు మొబైల్‌ఫోన్ల అందజేత

జైనథ్, జూలై 24: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వారు వివిధ కారాణాల వల్ల తమ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు బుధవారం పోలీసు హెడ్‌క్వాటర్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అందజేశారు. ఇందులో జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 14 మంది బాధితులకు తిరిగి మొబైల్ ఫోన్లను అందించామన్నారు. జైనథ్, బేల, భీంపూర్ మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదురైతే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐ ప్రసాద్, జైనథ్‌రూరల్ సీఐ సాయినాథ్, ఎస్ఐ కే.పురుషోత్తంలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

గుడిహత్నూర్, జూలై 24: అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రేవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కొత్త పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు మాత్రమే అర్హులన్నారు. 18ఏళ్ల నుంచి 59ఏళ్లలోపు వయస్సు కలిగిన, కొత్తగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాత పట్టాదారులు నామిని చనిపోతే ఆ వివరాలు ఏఈవోలకు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి (ఏఈవో) గ్రామంలోని రైతు వేదికలో అందజేసి రైతు బీమా నమోదు చేయించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'

తలమడుగు, జూలై 24: అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి సర్వేలు చేపట్టడం జరిగిందని వారి సమస్యల వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జరి అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు సొంత భవనాలు లేని చాలిచాలనీ ఇరుకు గదుల లాంటి రెంట్ రూమ్‌లో శిథిలావస్థకు చేరుకున్న కేంద్రాలలో అనేక సమస్యల నడుమ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వర్షాలకు పై కప్పులు ఊరుస్తున్నా అందులోనే కేంద్రాలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొని ఉందని పలు సమస్యలపై పేర్కొన్నారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధోనిపెల్లి వెంకటమ్మ, నాయకులు, అనసూయ, రాధ, టి.అనసూయ, విజయ, గ్రామ పంచాయతీ యూనియన్ సభ్యులు అరుణ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు

భాషా నైపుణ్యాలు

పెంపొందించేందుకు రూమ్ టు రీడ్



పాఠశాల సందర్శించిన రూమ్ టు రీడ్ బృందం

నిర్మల్ కల్చరల్, జూలై 24 : విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు రూమ్ టు రీడ్ దోహదపడుతుందని ఆ సంస్థ జాతీయ పర్యవేక్షణ సభ్యులు జెస్సీ మేరీ అన్నారు. బుధవారం జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. తమ సంస్థ అందిస్తున్న పుస్తకాలు విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. భవిష్యత్తులో అందించే పుస్తకాల వివరాలు, చేపట్టే ప్రాజెక్టులను వివరించారు. మండల నోడల్ అధికారి తోడిశెట్టి పరమేశ్వర్, రాష్ట్ర ప్రాజెక్టు అధికారి నితిన్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ రవి, బ్లాక్ కోఆర్డినేటర్ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయుడు శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



వడ్యాల్‌లో ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, జూలై 24 : మండలంలోని వడ్యాల్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ద్వారా ఆర్థిక పరమైన క్రమశిక్షణ పైన, పొదుపు, కుటుంబ బడ్జెట్ తదితరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీబీ ఆర్ఎం డీవీఎస్ రామారావు, ఆర్‌బీఐ ఏజీఎం అబ్దుల్ రెహమాన్, ఎల్‌డీఎం రామ్ గోపాల్, టీఎల్‌డీసీ కన్వీనర్ గోపాల్, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్ఎంవో అభినయరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అశోక్ వర్మ, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ముథోల్, జూలై 24 : ముథోల్ మండలంలోని బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అందించిన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, లక్ష్మణ్, ఎంఈవో షైసాజి, మండల బాధ్యులు రవి జాదవ్, నన్నం రాజేశ్వర్, ఉపాధ్యాయులు టక్కరి రమేష్, రాజశేఖరచారి, పోలీస్‌కర్ గంగాధర్, ప్రధానోపధ్యాయులు రాజారెడ్డి, నరసింహ చారి, ప్రజ్యోత్‌కుమార్, రామాగౌడ్, బసవరాజు, భోజబాయి, గంగాధర్‌తో పాటు యాదవ్, రాజారెడ్డి, నరసింహచారి, తోట గంగాధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు నరేంద్రబాబు

సారంగాపూర్ రూరల్, జూలై 24 : ఉపాధ్యాయులందరూ కలిసి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. బుధవారం పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా చించోలి(బి), ధని, జామ్, సారంగాపూర్, స్వర్ణ, మలక్ చించోలి, బీరవెల్లిలలో గల పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలతో పాటు పాఠశాలల్లో స్కావెంజర్లు వచ్చే విధంగా సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం. కృష్ణ, పీఆర్‌టీయూ సంఘ నాయకులు ఎస్ నర్సయ్య, గంగాసాగర్, పరమేశ్వర్, గంగారాంతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.



పీఆర్‌టీయూ సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

ఆదర్శ అధికారికి ఆత్మీయ వీడ్కోలు



ఎంపీవో అజీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు

దిలావర్‌పూర్, జూలై 24 : విధుల నిర్వహణలో అందరికి ఆదర్శంగా పనిచేస్తూ బదిలీపై సారంగాపూర్ మండలానికి వెళ్తున్న ఎంపీవో అజీజ్‌ఖాన్‌తో పాటు ఇతర మండలాలకు బదిలీపై వెళ్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులను మండల పరిషత్ సిబ్బంది బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ పల్లెల ప్రగతికి కృషి చేశారని పలువురు కార్యదర్శులు అన్నారు. విధుల నిర్వహణలో సలహాలు, సూచనలు ఇస్తూ మమ్మల్ని ప్రోత్సహించారని అన్నారు. ఉద్యోగ నిర్వహణలో అజీజ్ సర్‌ను ఆదర్శంగా తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీవో అజీజ్‌ఖాన్‌ను, పంచాయతీ కార్యదర్శులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్‌టీవోకు ఘన సన్మానం



ముథోల్, జూలై 24 : ముథోల్ నుండి బదిలీపై వెళ్లిన ఎస్‌టీవో సత్యనారాయణకు బుధవారం ఎస్‌టీయూటీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుమారు 12 సంవత్సరాలు ముథోల్ ఎస్‌టీవోగా విధులు నిర్వహించి జగిత్యాల డీటీవో కార్యాలయంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అతను చేసిన సేవలను కొనియాడారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బదిలీపై వెళ్లిన సత్యనారాయణకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మండల శాఖ ఎస్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు రవిజాదవ్, నన్నం రాజేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టక్కరి రమేష్, బి. గంగారావ్, జిల్లా బాధ్యులు రాజశేఖరచారి, రామాగౌడ్, రాజు, నారాయణ, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఖానాపూర్ తెలంగాణ చౌక్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఖానాపూర్, జూలై 24 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఖానాపూర్‌లో బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. మండలంలోని సుర్జాపూర్ గ్రామ బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఇలా వేరువేరు చోట్ల మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజ గంగన్న, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కల్వకుంట్ల నారాయణ, పట్టణాధ్యక్షుడు గౌరికర్ రాజు, జిల్లా నాయకులు బీసీ రాజన్న, శనిగారపు శ్రావణ్, కే. గోపాల్, బి. నరేందర్, బొమ్మెన రాకేష్, ఎస్. ప్రసాద్, దివాకర్, మల్లేష్, నర్సయ్య, తదితరులున్నారు.

నిర్మల్ కల్చరల్ : జిల్లాకేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు మొహమ్మద్ నజీరుద్దీన్, సుశీల్ కుమార్, లక్ష్మణాచారి, కాజా అక్రమ్ అలీ, మసూద్ ఖాన్, అనిల్ కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్ రెడ్డి, మందపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ గాండ్ల శంకర్, బీఆర్ఎస్ నాయకులు సుతారి మహేందర్, సొన్న రాజేందర్, వెన్నెల సూర్య, తదితరులు ఉన్నారు.



'ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి'



భైంసాలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్

భైంసా, జూలై 24 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవ వేడుకలలో భాగంగా భైంసాలో నిర్వహించిన ముథోల్ నియోజక వర్గ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ప్రతినిధులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకే పరిమితమయ్యారని తెలిపారు.. ఇక కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గంగా చరణ్, బీఆర్ఎస్ బాసర, కుంటాల, కుభీర్ మండలాల కన్వీనర్లు కోర్వ గంగా శ్యామ్, పడకంటి దత్తు, ఎన్నిల అనిల్‌కుమార్, భైంసా టౌన్ ప్రతినిధి రావుల పోశెట్టి, జిల్లా యూత్ కన్వీనర్ దశరథ్, కుభీర్ మాజీ వైస్ ఎంపీపీ మొయినొద్దీన్‌లతో పాటు నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'రైతు బీమా సద్వినియోగం చేసుకోవాలి'

నర్సాపూర్(జి), జూలై 24 : రైతు బీమా పథకంలో చేరడానికి అవకాశం వచ్చిందని వ్యవసాయ శాఖ నుంచి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యశ్రీ అన్నారు. ఆగస్టు 5 వరకు మాత్రమే గడువు ఉందని, రైతులు సకాలంలో దరఖాస్తులు చేసుకోకపోతే మళ్ళీ ఏడాది వరకు వేచి ఉండాల్సి వస్తుందని రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ షాక్ రాకుండా చర్యలు

భోథ్, జూలై 24 : మండలంలోని విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న వివిధ రకాల మొక్కల తీగలను బుధవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. వర్షా కాలంలో వివిధ రకాల మొక్కల తీగలు విద్యుత్ స్తంభాలపై, ట్రాన్స్‌ఫార్మర్ల్ పై పాకడంతో వాటి వల్ల విద్యుత్‌షాక్ వచ్చే ఆస్కారం ఉందని గ్రహించి ఆ శాఖ అధికారులు స్తంభాలపై అల్లుకున్న తీగలను తొలగించారు. నేలతడిగా ఉండడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఈ చర్యలు చేపట్టారు. ఈ కార్య క్రమంలో లైన్మెన్ రమేష్, జూనియర్ లైన్మెన్ రాజు, సిబ్బంది షఫీ పాల్గొన్నారు.

బదిలీలు నిలిపి వేయాలి

ఆదిలాబాద్ రూరల్, జూలై 24: రిమ్స్ వైద్యుల బదిలీలు నిలిపి వేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ బుధవారం కోరారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.7 । కనిష్ఠం 24.4



నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 25 జూలై 2024



వీడీసీల పెత్తనంపై సర్కారు ఆంక్షలు

- గ్రామ పంచాయతీల్లో జోక్యంపై జిల్లా యంత్రాంగం ఆగ్రహం
- తీవ్ర కలకలం రేపుతున్న అడిషనల్ కలెక్టర్ హెచ్చరికలు
- ఇక పల్లెల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధిపత్యానికి బ్రేక్
- వరుస సంఘటనలు, బాధితుల ఫిర్యాదులతో స్పందించిన యంత్రాంగం

నిర్మల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత కొన్ని సంవత్సరాల నుంచి కొనసాగుతున్న వీడీసీ(గ్రామాభివృద్ధి కమిటీ)ల పెత్తనానికి ఇక బ్రేక్ పడబోతోంది. వరుస సంఘటనలు, బాధితుల ఫిర్యాదులు, మానవ హక్కుల కమిషన్ సూచనలతో ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం వీడీసీల అప్రజాస్వామిక, అనధికారిక కార్యకలాపాలపై స్పందించింది. ఈ మేరకు వీడీసీలు అప్రజాస్వామిక చర్యలకు గానీ రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామంటూ స్వయంగా అడిషనల్ కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారి చేసిన హెచ్చరికలు ప్రస్తుత పల్లెల్లో దుమారం రేపుతున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లో గల వీడీసీలు కొంత కాలం నుంచి సమాంతర వ్యవస్థను నడుపుతూ అన్నీ తామై వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఆర్థిక వనరుల నుంచి మొదలుకొని కుటుంబ తగాదాల వరకు జోక్యం చేసుకుంటూ కోర్టులను తలదన్నే విధంగా తీర్పులు, తీర్మానాలు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. చాలా మంది అమాయక బాధితులకు తమ మాట వినని కారణంగా సామాజిక బహిష్కరణ లాంటి శిక్షణలను విధించి వేధింపులకు పాల్పడుతున్నాయన్న విమర్శలున్నాయి. వీడీసీల ఆగడాలపై ఇప్పటికే చాలా మంది బాధితులు ఉన్నతాధికారులకు, పోలీసులకే కాకుండా రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను సైతం ఆశ్ర యించి ఫిర్యాదులు చేశారు. అయితే ఒత్తిళ్ళకు తలొగ్గుతున్న కొంతమం ది తమ ఫిర్యాదులను వెనక్కి తీసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. గ్రామాల్లో ప్రజాస్వామిక బద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులందరిని పక్కకు నెట్టేసి వీడీసీలే పెత్తనం చెలాయిస్తున్న సంగతి తెలిసిందే. వీడీసీల తీర్మానాలను, తీర్పులను ఎదురించే వారికి కఠినశిక్షలు అమలవుతున్నాయి. వ్యక్తులకే కాకుండా కుల సంఘాలకు సైతం వీడీసీలు సామాజిక బహిష్కరణలాంటి శిక్షలు విధిస్తుండడం వివాదాస్పదమవుతోంది. కాగా ఎమ్మెల్యేస్థాయి నుంచి మొదలుకొని కిందిస్థాయి ప్రజా ప్రతినిధులంతా తమ రాజకీయ ప్రయోజనాల కోసం విడిసిలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రచా రం ఉంది. ఎన్నికల సమయంలోనూ ఇతర రాజకీయ కార్యకలాపాల సమయంలోనూ వీరంతా వీడీసీలను ఆశ్రయించి అక్కడి గ్రామస్థుల మద్దతును కూడగడుతున్నట్లు చెబుతున్నారు. దీని కారణంగా ఇటు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులు సైతం విడిసిలకు ప్రాధాన్యతనిస్తుండడం గమనార్హం. దీంతో పాటు గ్రామానికి సంబంధించిన ప్రధాన ఆధాయ వనరులైన బెల్ట్ షాపులు, ఇసుక క్వారీలు, కూల్‌డ్రింక్ షాపులు, చికెన్ సెంటర్‌ల నిర్వహణను సైతం వీడీసీలు తమ గుప్పిట్లోకి తీసుకొని వాటికి పెద్దఎత్తున వేలం పాటలు నిర్వహిస్తూ డబ్బులు కూడగడుతున్నాయన్న ఆరోపణలు న్నాయి. వీడీసీల నిర్ణయాన్ని ధిక్కరించడం గ్రామాల్లో మామూలు వ్యక్తులకే కాదు బడా వ్యక్తులకు కూడా సాధ్యం కాదని అంటున్నారు. సర్పంచ్‌లను డమ్మీ చేసి ఈ వీడీసీలు బహిరంగంగా తీర్పులిస్తూ సమాంతర వ్యవస్థకు సాక్ష్యంగా నిలుస్తున్నాయంటున్నారు. అయితే కొన్ని వీడీసీలు మాత్రం నిజాయితీగా వ్యవహరిస్తున్నప్పటికీ చాలా గ్రామాల్లోని వీడీసీలు ఇదే తరహా పోకడలను అవలంభిస్తున్న కారణంగా జిల్లా ఉన్నతాధికారులు ఎట్టకేలకు స్పందించారు. అడిషనల్ కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారి వీడీసీలపై స్వయంగా హెచ్చరికలతో కూడిన ప్రెస్‌నోట్‌ను జారీ చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిందని అంటున్నారు.

ఆదాయ వనరులే లక్ష్యంగా..

ఇదిలా ఉండగా వీడీసీలు గ్రామాల్లోని ప్రధాన ఆదాయ వనరులను తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నట్లు విమర్శలున్నాయి. ముఖ్యంగా గ్రామంలో బెల్ట్ షాపుల ఏర్పాటును అలాగే వాటి నిర్వహణ కోసం చేపట్టే టెండర్ ప్రక్రియను వీడీసీలు స్వయంగా నిర్వహిస్తున్నాయి. ఈ బెల్ట్ షాపుల ఏర్పాటు వ్యవహారంలో లక్షల రూపాయల ఆదాయాన్ని వీడీసీలు సమకూర్చుకుంటున్నాయని అంటున్నారు. కల్లు దుకాణాలను సైతం వీడీసీలే అనధికారికంగా ఏర్పాటు చేసి ఎక్కువ మొత్తంలో చెల్లించిన వారికి వాటిని అప్పగిస్తున్నారంటున్నారు. కొన్ని చోట్ల వీడీసీలు నిర్వహించే బెల్ట్‌షాపుల టెండర్‌లకు వైన్స్ దుకాణాల యజమానులే పాల్గొంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. దీంతో పాటు గ్రామాల్లోని వాగులను సైతం వీడీసీలు తమ ఆధీనంలో పెట్టుకొని అందులోని ఇసుకకు టెండర్‌లను నిర్వహిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కూడా లక్షల రూపాయల లావాదేవీలు సాగుతున్నాయని అంటున్నారు. గ్రామంలో కొనసాగే చికెన్ సెంటర్‌లు, కూల్‌డ్రింక్ షాపులకు సైతం వీడీసీలు వేలం పాటలు నిర్వహించి తమకు ఎక్కువ మొత్తంలో చెల్లించే వారికి వాటిని అప్పగిస్తున్నాయని అంటున్నారు. అయితే ఇలా అనధికారికంగా, అక్రమంగా సమకూరిన నిధులతో తాము గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటూ అక్కడి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

మాట వినకుంటే వేటు తప్పదు


చాలా గ్రామాల్లో సమాంతర వ్యవస్థను నడిపిస్తూ అంతా తామై కొనసాగుతున్న వీడీసీల తీర్పులను ఉల్లంగిస్తే కఠినచర్యలు ఎదురవుతున్నాయని అంటున్నారు. వీడీసీలు చేసే తీర్మానాలు గాని, తీర్పులను గాని ప్రభుత్వశాఖల కన్నా ఎక్కువ రీతిలో ఉంటున్నాయంటున్నారు. కోర్టుల కన్నా ధీటుగా వీడీసీల తీర్పులు అక్కడి పల్లెల్లో అమలవుతున్నాయని అంటున్నారు. వ్యక్తులకే కాకుండా కుల సంఘాలకు, ఒక్కో కుటుంబానికి వీడీసీలు శిక్షలు వేస్తున్నాయంటున్నారు. భారీమొత్తంలో భారీమానాలు అలాగే సామాజిక బహిష్కరణలు, దీంతో పాటు గ్రామ బహిష్కరణలు లాంటి కఠిన శిక్షలను సైతం విడిసిలు అమలు చేస్తున్నాయని అంటున్నారు. వీడీసీల తీర్పులకు, తీర్మానాలకు అత్యంత ప్రాధాన్యత కారణంగా గ్రామాలు వీరిని ఎదురించేందుకు ఎవరూ సాహసం చేయరంటున్నారు. చాలా సందర్భాల్లో పోలీసులు సైతం సయోధ్య కుదుర్చేందుకే ప్రాధాన్యతనిస్తున్నారే తప్ప చర్యలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదంటున్నారు.

కలకలం రేపుతున్న అడిషనల్ కలెక్టర్ హెచ్చరికలు



వీడీసీల అప్రజాస్వామిక, అనధికారిక చర్యలపై ఎట్టకేలకు జిల్లా ఉన్నత యంత్రాంగం స్పందించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. ఏకంగా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ రెండు రోజుల క్రితం వీడీసీలకు ప్రత్యేకంగా జారీ చేసిన ప్రకటన ప్రస్తుతం అంతటా కలకలం రేపుతోంది. అప్రజాస్వామికంగా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించే వీడీసీలపై కఠినచర్యలు తీసుకుంటామని, మేజిస్ట్రేట్ హోదాలో అడిషనల్ కలెక్టర్ చేసిన హెచ్చరికలు వందలాది మంది బాధితుల్లో ఉత్సాహం నింపుతోందని అంటున్నా రు. కాగా ఈ హెచ్చరికల కారణంగా వీడీసీ సభ్యుల్లో ఆందోళన మొదలైందన్న ప్రచారం కూడా మొదలైంది. ఇప్పటి వరకు ఏ ఉన్నతాధికారి కూడా ఇలాంటి బహిరంగ హెచ్చరిక జారీ చేయలేదని, అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారి కఠినంగా హెచ్చరించడం రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయోనని అంటున్నారు.

కడెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



కడెం ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

ఖానాపూర్, జూలై 24 : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 692.975 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటిలో సామర్థ్యం 7.603 టీఎంసీలుగా ప్రస్తుతం 5.898 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 17,557 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 14,391 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి నామమాత్రపు ఇన్‌ఫ్లో

- ఈ సీజన్‌లో కేవలం 0.057 టీఎంసీల వరద నీటి చేరిక



గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 24 : ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో అంతంతగానే కురుస్తున్న వర్షాలతో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి నామమాత్రంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గత మూడు రోజులుగా ఇక్కడి ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 355.9 మీటర్లతో ఎలాంటి పెరుగుదల లేకుండా నిలకడగానే కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.852 టీఎంసీల నీటి నిల్వల సామర్థ్యం ఉంది. అయితే చెప్పుకోతగ్గ ఇన్‌ఫ్లో లేని కారణంగా ప్రస్తుత ప్రాజెక్టు నీటి మట్టం 355.9 మీటర్లు ఉండగా నీటి నిల్వలు 0.733 ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులకు పైగా కాలం గడిచిన ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి ఇప్పటి వరకు 0.057 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

స్వీయ నియంత్రణతోనే ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న భైంసా బస్సు డిపో మేనేజర్ హరిప్రసాద్

భైంసా, జూలై 24 : డ్రైవర్ల స్వీయ నియంత్రణతోనే ప్రమాదాలను నియంత్రించ వచ్చునని భైంసా బస్సు డిపో మేనేజర్ హరి ప్రసాద్, టౌన్ ఎస్ఐ గౌస్ పాషాలు పేర్కొన్నారు. బుధవారం భైంసా ఆర్‌టీసీ బస్సు డిపో అవరణలో ప్రమాద రహిత వారోత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయని, డ్రైవర్లు అప్రమత్తతతో ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. వర్షాకాలంలో వేగ నియంత్రణ చాలా ముఖ్యమని, మూలమలుపుల వద్ద ఓవర్ టేకింగ్ చేయవద్దని డ్రైవర్లకు సూచించారు.ఇందులో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భగవంత్‌రావ్, డిపో డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



చాక్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ దృశ్యం

నర్సాపూర్(జి), జూలై 24 : మండలంలోని చాక్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తనిఖీ నిర్వహించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం రిజిస్టర్, హజరు రిజిస్టర్, పాల ప్యాకెట్ల పంపిణీపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపీడీవో పుష్పలత, యంపీవో శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నరేష్, మ్యాదరి సుధాకర్, సయ్యద్ కలీం, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, జూలై 24 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేందుకు నిర్మల్ సర్కింగ్ పరిధిలో 13 కొత్త కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో 5 ఏర్పాటు చేయనున్నామన్నారు. వోల్టేజ్ హెచ్చు తగ్గులు లేకుండా కెపాసిటర్లు ఉపయోగపడతాయని వివరించారు. సబ్‌స్టేషన్లలో ఓవర్‌లోడ్ కాకుండా నియంత్రిస్తాయని తెలిపారు. సబ్ స్టేషన్లలో ఎంవీఆర్ కెపాసిటర్లను పెట్టనున్నట్లు పేర్కొన్నారు. 11 కేవీ లైన్లలో 600ల కేవీఆర్ కెపాసిటర్లు అమర్చనున్నామని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్లకు లో వోల్టేజ్‌తో మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లు దోహదడతాయన్నారు. రియాక్టివ్ పవర్ ఫ్యాక్టర్ గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. సాంకేతిక సమస్యలు తగ్గుతాయని, పరికరాల మన్నిక పెరుగుతుందన్నారు. పారిశ్రామిక వినియోగదారులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరదనీరు

నిర్మల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా 20.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద నీటితో క్రమేపి ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 5.898 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 17,557 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 14,391 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.733 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతన్నారు. స్వర్ణ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.071 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లోకి 790 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కుంటాల, జూలై 24 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్ అన్నారు. బుధవారం కల్లూర్ కస్తుర్బాగాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రిన్సిపల్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపల్ స్వర్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

దిలావర్‌పూర్, జూలై 24 : ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని సిర్గాపూర్ గ్రామ శివారులో ఉన్న 664 సర్వే నెంబర్ భూమిలో నూతనంగా సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని నిర్మించనున్న స్థలాన్ని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన 17 ఎకరాల స్థలానికి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. అనంతరం 664 సర్వే నెంబర్ సరిహద్దులను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ ఆర్. సుదర్శన్, తహసీల్దార్ స్వాతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తైక్వాండో నూతన కమిటీ

నిర్మల్ కల్చరల్ : ఒలంపిక్ గేమ్ తెక్వాండో జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేసిన సందర్భంగా బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాద పూర్వకంగా సభ్యులు కలిశారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడు సోమేశ్వర్, అక్షయ్, వంశీ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ధర్నా



దర్నా చేస్తున్న దిలావర్‌పూర్ యువకులు

దిలావర్‌పూర్, జూలై 24 : మండలంలో నిర్మించనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా దిలావర్‌పూర్ యూత్ నిరసనకు దిగారు. ఈ మేరకు దిలావర్‌పూర్ బస్టాండ్ పక్కన ధర్నా చేప ట్టారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం ఆపే వరకు ఉద్యమాన్ని కొన సాగిస్తామని పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షలు చేపడతామని అప్పటికీ నిర్మాణం ఆపకపోతే ఆమరణ దీక్ష చేస్తామని అన్నారు. గ్రామానికి చెందిన కొందరు పరిశ్రమ యాజమాన్యంతో కుమ్మక్కై భవిష్యత్ తరాలను పణంగా పెడుతున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామన్నారు. నిరసన కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

భేటీ బచావో భేటీ పడావోపై

విద్యార్థులకు అవగాహన

ఖానాపూర్, జూలై 24 : భేటీ బచావో భేటీ పడావో అంశంపై మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాజంలో ఆడపిల్లల మనుగడ, చదువు ప్రాధాన్యత తదితర అంశాలను వివరించారు. బాలికల ఆరోగ్య సమస్యలపై, లింగ వివక్ష, మహిళలపై దౌర్జన్యం, వరకట్న మరణాలు, ఆత్మహత్యలు, విష ప్రయోగాలు, భృణ హత్యలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, జిల్లా మహిళా సాధికార కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ ఏ. మౌనిక, కే. శిలాజ, కౌన్సిలర్లు లావణ్య, లలిత, ఉపాధ్యాయులు శోభారాణి, రజిత, తదితరులు పాల్గొన్నారు.



మస్కాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం

సంక్షిప్త సమాచారం

బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దృశ్యం

భైంసా రూరల్, జూలై 24 : భైంసా పట్టణానికి చెందిన ఓ బాలుడు మంగళవారం మండలంలోని చించాల గ్రామానికి రావటంతో స్థానికులు దుడ్డు ప్రసాద్, హౌజేకర్ దత్తు బాలుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భైంసా టౌన్ ఏఎస్సై సుదర్శన్ కు బాలుడి వివరాలు తెలియజేశారు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్ టౌన్, జూలై 24 : నిర్మల్ పట్టణం దివ్యనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొరిపెల్లి రాంకిషన్ రెడ్డి, అధ్యక్షులుగా పురావస్తు శంకర్, ప్రధాన కార్యదర్శులుగా గడుదాస్ రమేష్, కోశాధికారిగా నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్. రాజన్న, ఎస్. మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు నితిన్, మహేష్ రెడ్డిలు ఎన్నికయ్యారు.

ఏబీవీపీ సభ్యత్వ సేకరణ ప్రారంభం

నిర్మల్ కల్చరల్, జూలై 24 : ఏబీవీపీ సభ్యత్వాన్ని బుధవారం ప్రారంభించారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల నుండి స్వీకరించారు. ఎస్ఎఫ్‌సీ కన్వీనర్ శివకుమార్ మాట్లాడుతూ.. ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. 65 లక్షల మంది సభ్యత్వంతో సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు. విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతోందన్నారు. దినేష్, లక్ష్మణ్, గణేష్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

మంజులాపూర్ పాఠశాలలో స్పోర్ట్స్ డే నిర్వహణ

నిర్మల్ కల్చరల్, జూలై 24 : మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ సప్తాహంలో భాగంగా విద్యార్థులకు స్పోర్ట్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రీడాసంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సిద్ధపద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు చేస్తున్నాం : ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూలై 24 : వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలను మరమ్మతు చేయిస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ తెలిపారు. బుధవారం పాత ఎమ్మార్వో కార్యాలయ ప్రాంతంలో పర్యటించారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పరిశీలించారు. తక్షణ మరమ్మతులకు ఆదేశించారు.